మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 112    బుధవారం    08 - 10 - 2025    పేజీలు: 8    వెల: 4

## పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి



3లో..



# నూతన బీసీ గురుకులాలు ఏర్పాటు చేస్తాం

- ఉన్నత విద్య చదివే బీసీ విద్యార్థులకు ప్రభుత్వం భరోసా
- పావలా వడ్డీతో విద్యా రుణాలిస్తాం
- వాల్మీకులను ఎస్టీలో చేరుస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- కర్నూలులో ఘనంగా వాల్మీకి జయంత్యోత్సవం



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రంలో మరిన్ని నూతన బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వెనుకబడిన తరగతుల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమి స్తోందని, ఇందులో భాగంగా బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. వాల్మీకులకు ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత ప్రకటించారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంత్యోత్సవాన్ని కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిట రియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజల్వన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వాల్మీకి రామాయణం రచించి సమాజానికి సన్మార్గాన్ని చూపుతోందన్నారు. వాల్మీకి మహర్షి వాల్మీకులకు మాత్రమే సొంతం కాదని ప్రపంచానికే సొంతమన్నారు. వాల్మీకి రామాయణం ప్రపంచ ప్రఖ్యాతగాంచిందన్నారు. రామాయ ణం కేవలం మత గ్రంథం మాత్రమే కాదని కుటుంబ విలువలు, నైతిక విలువలు బోధిస్తూ, సమాజ నిర్మాణానికి దిక్సూచిగా పనిచేస్తోందని అన్నారు. భార్యాభర్తలు, అన్న దమ్ముల మధ్య సఖ్యత గురించి, రాజ్య పరిపాలన ఎలా చేయాలో రామాయణం చదివితే చాలని విదేశీయులు సైతం భావిస్తుంటారని మంత్రి గుర్తు చేశారు. 2 లో..



## పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై

# బాంబు దాడి

- సింధ్ ప్రావిన్స్‌లో రైల్వే ట్రాక్‌పై పేలుడు, ఏడుగురికి గాయాలు

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని షికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం 2 లో..

## ఉత్తర బెంగాల్‌లో

# బీజేపీ నేతలపై దాడి



- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ

మన గళం, న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో ప్రకృతి విపత్తు రాజకీయ రంగు పులుముకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఇద్దరు బీజేపీ నేతలపై దాడి జరగడంతో, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం మొదలైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించగా, 2 లో..

## హెలికాప్టర్‌కు మాత్రమే

# అనుమతి!

- ఈనెల 9న అనకాపల్లి జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన



మన గళం, అమరావతి : వైసీపీ అధినేత జగన్ అనకాపల్లి జిల్లా పర్యటనకు సంబంధించి పోలీసులు కీలక సూచనలు చేశారు. ప్రజాభద్రత, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆయన రోడ్డు మార్గంలో ప్రయాణించేందుకు అనుమతి నిరాకరించారు. కేవలం హెలికాప్టర్‌లో మాత్రమే పర్యటనకు రావాలని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, జగన్ ఈ నెల 9వ తేదీన అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెంలో పర్యటించాల్సి ఉంది. ఈ పర్యటన కోసం విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మాకవరపాలెం వరకు సుమారు 63 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గంలో ప్రయాణించేందుకు వైసీపీ నేతలు పోలీసుల అనుమతి కోరారు. అయితే ఈ దరఖాస్తును జిల్లా పోలీసులు తిరస్కరించారు. ఈ విషయంపై అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ కుమార్ మీడియాకు వివరణ ఇచ్చారు. జగన్ రోడ్డు ప్రయాణ మార్గంలోని ప్రధాన కూడళ్ల వద్ద 2 లో..

## కర్నూలు జిల్లాలో

# బీసీ హాస్టళ్లను పెంచాలి

- మంత్రి సవితను కోరిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : వెనుకబడిన కర్నూలు జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కలెక్టర్ కర్యాలయంలోని సునయన ఆడిటరియంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి రాష్ట్ర స్థాయి జయంతోత్సవంలో రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్ ల తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రుల తో కలిసి వాల్మీకి మహర్షి చిత్ర పట్టానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముఠా కక్షలు, కరువుతో కర్నూలు జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అందరూ గొడవలను వీడి తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. చదువు కోవడానికి హాస్టల్ సౌకర్యాలు లేక చాలా మంది పిల్లలు తమ తల్లి తండ్రుల వెంట వలసలు వెళ్తున్నారని, జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టల్స్ ని పెంచాలని మంత్రి సవితను ఎంపీ కోరారు. ఇక ఆటవిక జీవితాన్ని వదిలి మహర్షిగా ఎదిగిన వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా కలెక్టర్ డాక్టర్.సిరి, ఎం.ఎల్.సీ బీటి నాయుడు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారా యణ, ఎమ్మెల్యేలు గౌరు చరిత, పార్థసారథి, గుమ్మ నూరు జయరాం, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు,వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## జరిగిన దానికి నేనేమీ

# చింతించడం లేదు

- లాయర్ రాకేశ్ కిషోర్



మన గళం, న్యూఢిల్లీ : సీజేఐ గవాయ్‌పై షూ విసిరేయబోయే ఘటన పట్ల తానేమీ పశ్చాతాపం పడడం లేదని అడ్వకేట్ రాకేశ్ కిషోర్ అన్నారు. గవాయ్‌పై షూ విసిరేయబోయిన ఘటన గురించి మీడియాతో ఆ లాయర్ మాట్లాడారు. ఆ ఘటన పట్ల తానేమీ నిరాశ చెందడం లేదన్నారు. నేనేమీ భయడడం లేదని, జరిగిన దానికి 2 లో..

# ప్రధాని మోడీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేద్దాం

- స్వామివార్ల దర్శనార్థం వస్తున్న ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు - నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

మనగళం, శ్రీశైలం : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం నల్లమల అరణ్యంలో వెలసిన శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకునేందుకు ఈ నెల 16 వ తేదీన వస్తున్న ప్రధానికి వారు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైల దేవస్థానం పాలకమండలి సభ్యులు మేడా మురళీధర్, రేఖా గౌడ్ లతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలుకారు. అర్చకులు, వేదపండితులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, చైర్మన్ రమేష్ నాయుడు, సభ్యులు మేడా మురళి, రేఖలకు స్వామి, అమ్మ వార్ల దర్శనం అనంతరం శేష వస్త్రాలతో సన్మానం చేసి, తీర్థ ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం 2 లో..



## ప్రభుత్వాధినేతగా

# 25 ఏళ్ల సేవ..



2 లో..

- అనుభూతులు పంచుకున్న ప్రధాని మోదీ

# పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై బాంబు దాడి



ఇదే మొదటిసారి కాదు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, షికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈ పేలుడు సంభవించినట్లు షికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని షికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. ఆ ఘటనలో రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. అంతకుముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఉగ్రవాదులు ఇదే రైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. తాజా ఘటనతో ప్రయాణికుల్లో మరోసారి ఆందోళన నెలకొంది.

# ఉత్తర బెంగాల్‌లో బీజేపీ నేతలపై దాడి

విపత్తును అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా బదులిచ్చారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు ఉత్తర బెంగాల్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఘటనల్లో ఇప్పటివరకు 30 మందికి పైగా మరణించగా, పలువురు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జల్‌పాయ్‌గురి జిల్లాలోని నాగర్‌కాటాలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము, సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌లపై స్థానికులు దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీ ముర్ము ముఖం, ముక్కు నుంచి రక్తం కారుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారని బీజేపీ ఆరోపించగా, ప్రతిపక్షాలు చేస్తున్న "ఫోటో-ఆప్ రాజకీయాల" వల్లే ప్రజాగ్రహం వ్యక్తమైందని టీఎంసీ కొట్టిపారేసింది. ఈ దాడి ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. "వరద బాధితులకు సేవ చేస్తున్న మా పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేపై జరిగిన దాడి దిగ్భ్రాంతికరం. ఇది ఇతరుల భావాలను పట్టించుకోలేని టీఎంసీ తత్వాన్ని, రాష్ట్రంలో దారుణంగా ఉన్న శాంతిభద్రతల పరిస్థితిని తెలియజేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధాని విమర్శలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అంతే ఘాటుగా బదులిచ్చారు. "విపత్తు సమయంలో ప్రజలు కష్టాల్లో ఉంటే, ప్రధాని ఎలాంటి విచారణ లేకుండా ఈ ఘటనను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఎలాంటి ఆధారాలు, విచారణ నివేదికలు లేకుండానే టీఎంసీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని ఆమె 'ఎక్స్'లో స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజకీయ వేదికల నుంచి చేసే ట్వీట్లతో నేర నిర్ధారణ జరగదని ఆమె హితవు పలికారు. ఈ ఘటనపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరించాలని సూచించారు.

మరోవైపు, ఈ విపత్తు కారణంగా డార్జిలింగ్, మీరిక్ వంటి ప్రాంతాల్లో అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. బాధితుల కుటుంబాలకు రూ. 5 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు.

# నూతన బీసీ గురుకులాలు ఏర్పాటు చేస్తాం

వాల్మీకుల అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడితోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. వాల్మీకులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడమే టీడీపీ ధ్యేయమన్నారు. ఎందరో వాల్మీకి సామాజిక వర్గ నేతలకు మంత్రిగా ఎంపీగా, ఎమ్మెల్యేగా,ఎమ్మెల్సీగా, ఇతర ప్రజాప్రతినిధులుగా సీఎం చంద్రబాబునాయుడు అవకాశమిచ్చారన్నారు. రాష్ట్ర పరిశ్ర మలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వాల్మీకులకు ఎస్టీ హోదా కు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ప్రస్తుతం డబల్ ఇంజన్ సర్కార్ ఉన్నందున ఇందుకోసం ముఖ్యమంత్రి కృషి ఫలించి, సానుకూల ఫలితాలు వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వాల్మీకి భవన నిర్మాణానికి తన వంతుగా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. కాపు భవన్ , బీసీ భవన్ ల నిర్మాణానికి కోటి రూపాయల చొప్పున ప్రకటించడం జరిగిందని, అదే విధంగా వాల్మీకి భవన్ కు టి. జి. వి. సంస్థ నుండి ఒక కోటి రూపాయలు విరాళంగా ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి భరత్ తెలిపారు. కర్నూల్ పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు , అనంతపురం జిల్లాలో వాల్మీకులు చదువులో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. భవిషత్తు లో వాల్మీకులు బాగా చదువు కోవాలని, అభివృద్ధి చెందాలని, రాజకీయం గా కూడా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతోత్సవం వేడుకలను కర్నూలులో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాల్మీకులకు ఎటువంటి కుల వృత్తి లేనందున బీసీ కార్పొరేషన్ కింద రుణాలను వినియోగించుకోలేకున్నామని, బీసీ కార్పొరే షన్‌లో కుల వృత్తి లేకుండా వాల్మీకి కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. . అనంతపురం లో ఉండే సెంట్రల్ యూనివర్సిటీకి మహర్షి వాల్మీకి యూనివర్సిటీగా నామకరణం చేయాలని మంత్రి గారిని కోరారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షి వాల్మీకి గతం లో రత్నాకరుడుగా ఉండి వాల్మీకిగా మారడం గురించి వివరించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పూర్ణిమ రోజున వాల్మీకి జయంతోత్సవం జరుపుకుంటున్నామన్నారు. వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సాహిత్యం, ధర్మం, మానవత్వ విలువలతో కూడుకొని ఉంటుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గా పరివర్తన చెంది, రామాయణాన్ని రచించి ఆదికవిగా పేరుగాంచారన్నారు. ఆదోని శాసనసభ్యులు పార్థసారధి మాట్లాడుతూ 1956 సంవత్సరం వరకు వాల్మీకులకు ఉన్న ఎస్టీ హోదా ను తొలగించి అప్పటి ప్రభుత్వం బిసి హోదా ఇచ్చారన్నారు. కానీ దేశం లో అందరు వాల్మీకులు ఎస్టీ హోదా లో ఉన్నారన్నారు. కేవలం ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం బిసి లుగా ఉన్నారన్నారు. 1956 నుండి నేటి వరకు ఎస్టీ సాధన కోసం పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. ఎస్టీ జాబితాలో ఉండవలసిన సంచార జాతులు అయిన మాదాసి, మాదాసి కురువలు కూడా బీసీలుగా ఉండి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న కూటమి డబల్ ఇంజన్ సర్కార్ ద్వారానే వాల్మీకులకు ఎస్టీ హోదా వస్తుందని తెలియజేశారు. 2019వ సంవత్సరం ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారం నిమిత్తం కర్నూలుకు వచ్చినప్పుడు ఈ అంశం గురించి ప్రధాన మంత్రి దృష్టికీ తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు. ఈ నెల 16న ప్రధానమంత్రి , ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా కి రానున్న సందర్భంగా ఈ సమస్యను మరల ఒకసారి వారి దృష్టికి తీసుకుని వెళ్లి ఎస్టీ హోదా వాల్మీకులకు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ వాల్మీకులు చదువుకుంటే, భవిష్యత్తు బాగుంటుందని, పిల్లల్ని బాగా చదివించాలని కోరారు. ఎటువంటి గొడవలకు వెళ్లకుండా బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, కురువ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ దేవేంద్రప్ప, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, వాల్మీకి సంఘం నాయకులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## జరిగిన దానికి నేనేమీ
# చింతించడం లేదు

చింతించడం లేదని అన్నారు. సెప్టెంబర్ 16వ తేదీన కోర్టులో ఓ పిల్ వేశామని, ఆ కేసులో సీజేఐ తీర్పునిస్తూ.. దేవుడి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకోవాలన్నారని, సనాతన ధర్మం అంశంపై కేసులు వస్తే, సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేస్తోందని ఆయన ఆరోపించారు. పిటీషన్‌దారుడికి రిలీఫ్ ఇవ్వలేకపోయినా పర్వాలేదు, కానీ ఆ పిటీషనర్‌పై వెటకారం సరికాదు అని లాయర్ రాకేశ్ తెలిపారు. ఆ కేసులో సీజేఐ వ్యాఖ్యల పట్ల బాధపడ్డానని, కానీ తానేమీ తాగి షూ విసిరే ప్రయత్నం చేయలేదన్నారు. ఆ వ్యాఖ్యలకు ఇది నా కౌంటర్ అని అన్నారు. నా పేరు డాక్టర్ రాకేశ్ కిషోర్. ఎవరైనా నా కులం ఏంటో చెప్పగలరా? నేను కూడా దళితుడినే కావొచ్చు. సీజేఐ దళితుడన్న కోణంలో మీరు ఆలోచిస్తున్నారేమో.. కానీ ఆయన దళితుడు కాదు.. ఆయన తొలుత సనాతన హిందువు అని, కానీ ఆయన తన మతవిశ్వాసాన్ని వీడి, బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు. ఒకవేళ హిందూ మతాన్ని వదిలేసి.. బౌద్ధాన్ని స్వీకరిస్తే, అప్పుడు ఆయన ఎలా దళితుడు అవుతాడని లాయర్ రాకేశ్ ప్రశ్నించారు. ఇదంతా మైండ్‌సెట్‌కు సంబంధించిన అంశమని ఆయన అన్నారు. తానేమీ క్షమాపణలు కోరబోనన్నారు. అలాగే చింతించే అంశం కూడా కాదన్నారు. సున్నిత అంశాలను పరిగణలోకి తీసుకుని జడ్జీలు పనిచేయాలన్నారు.

లక్షల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, తానేమీ చేయలేదని, మీరు నన్ను ప్రశ్నిస్తున్నారని, అందుకే దేవుడే నాతో ఈ పని చేయించారని లాయర్ కిషోర్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న ఓ గుడిలోని విష్ణువు విగ్రహాన్ని పునర్ ప్రతిష్ఠించాలని దాఖలు చేసిన పిల్‌పై సీజేఐ స్పందిస్తూ కొన్నివ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను తప్పుపడుతూ లాయర్ రాకేశ్ సోమవారం సీజేఐపై దాడికి ప్రయత్నించారు. గవాయ్‌పై షూ విసరబోయిన లాయర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 71 ఏళ్ల లాయర్ మయూర్ విహార్‌లో ఉంటున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో ఆయన రిజిస్టర్ సభ్యుడు.

# ప్రధాని మోడీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేద్దాం

అందించి ఆశీర్వదించారు. శ్రీశైలంలోనే ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్, శ్రీశైలదేవస్థానం ఈ ఓ శ్రీనివాసరావు తదితర జిల్లా ఉన్నతాధికారులతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడారు. పీఎం పర్యటనపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి ప్రత్యేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తో చర్చించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయముతో ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం అని వారు కోరారు. ఇప్పటికే అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రధాన మంత్రి శ్రీశైల పర్యటనవిజయవంతంపై సమీక్ష చేశారన్నారు. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ఏ మాత్రం పొరపాట్లు జరగకుండా భద్రత ఏర్పాటు చేయాలని కోరారు.



## ప్రభుత్వాధినేతగా
# 25 ఏళ్ల సేవ..



మన గళం, న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తన పరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆ నాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సీఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీ భూకంపం, సూపర్ సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లో పెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. తన ట్వీట్స్‌లో వివిధ అనుభవాలను గుర్తు చేశారు.

# హెలికాప్టర్‌కు మాత్రమే అనుమతి!



భారీగా జనసమీకరణ చేసి, ప్రద ర్శనలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ నిర్వహించిన సభలో తొక్కిసలాట జరిగిందని, అలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసే బాధ్యత తమపై ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కారణాల వల్లే రోడ్డు మార్గంలో ప్రయాణానికి అనుమతి ఇవ్వలేదని, అందుకు ప్రత్యామ్నాయంగా హెలికాప్టర్‌లో మాకవరపాలెం చేరుకోవాలని సూచించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు జగన్ హెలికాప్టర్ పర్యటనకు అవసరమైన అనుమతులు మంజూరు చేసినట్లు తుహిన్ కుమార్ స్పష్టం చేశారు.

## బాబాయికి
# మంత్రి లోకేశ్ ఘన నివాళి



మన గళం, అమరావతి :రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన బాబాయి, దివంగత నారా రామ్మూర్తినాయుడికి నివాళు లర్పించారు. రామ్మూర్తినాయుడి ప్రథమ వర్ధంతి సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నారావారిపల్లెలోని తమ నివాసంలో రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతికి సంబంధించి నిర్వహించిన ప్రత్యేక క్రతువులో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం, కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి గ్రామంలోని రామ్మూర్తినాయుడు స్మృతివనం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తన బాబాయిని స్మరించుకుంటూ కొంతసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై దివంగత రామ్మూర్తినాయుడికి నివాళులర్పించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

**– నూతన ప్రజారోగ్య అధికారి యస్.బి.విష్ణుమూర్తి**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నూతన ప్రజారోగ్య అధికారి యస్.బి. విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం ఆయన నగరపాలక కార్యాలయంలోని బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కమిషనర్ పి.విశ్వనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పారిశుద్ధ్య తనిఖీదారులతో సమావేశం నిర్వహించారు.

## పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పనిగంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రాత్రి షిఫ్టులలో మహిళలతో పని చేయించడాన్ని మానుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉండే 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. అయితే లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళనకు భయపడి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ ను అమలు చేయడానికి ప్రయత్నించలేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాల చేత అమలు చేయించడానికి ప్రయత్నిస్తుందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలులో భాగంగా ఎనిమిది గంటల పని విధానాన్ని 12, 13, గంటలకు, అలాగే రాత్రి షిఫ్టులలో మహిళలను పని చేయించడానికి అవసరమైన చట్ట సవరణను చేసిందని విమర్శించారు. ఇది కార్మిక వర్గంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. సీఐటీయూ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఓల్డ్ సిటీ అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ కోశాధికారి సాయిబాబా, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సుధాకరప్ప, నగర నాయకులు ఏసు, నగర అధ్యక్షులు నగేష్, ఆటో వర్కర్స్ యూనియన్ ఓల్డ్ సిటీ కార్యదర్శి మెహమూద్చ న్యూ సిటీ అధ్యక్షులు వలి, సీఐటీయూ కర్నూలు మండల కార్యదర్శి హుసేనయ్య, కల్లూరు మండల కార్యదర్శి మధు కార్మికులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడి హేయం




మనగళం, కర్నూలు సిటీ : పాలకుల చేతగాని తనమే ప్రజాస్వామ్య అపహస్యానికి కారణమని కేవీపీఎస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు విమర్శించారు. మంగళవారం కేవీపీఎస్, సీఐటీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి పై అవమానకరమైన దాడికి నిరసనగా కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ నగర కార్యదర్శి ఎం భాస్కర్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవీపీఎస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, సీఐటీయూ ఓల్డ్ సిటీ, న్యూ సిటీ కార్యదర్శులు ఎం విజయ్, ఆర్ నరసింహులు మాట్లాడారు. రోజురోజుకు దేశంలో మతం పేరుతో ఉన్మాదం పెరిగిపోతోందని విమర్శించారు. సాక్షాత్తూ భారత ప్రధాన న్యాయమూర్తి పై దాడి హేయమని ఖండించారు. ఉత్తరప్రదేశ్ లోని ఖజరహో ప్రాంతంలో ఉన్న శిల్పం కిందపడిందంటూ వచ్చిన కేసులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతుండగానే షూ తో విసరడం అన్నది రాజ్యాంగ యంత్రం పై జరిగిన దాడి అని ఆందోళన వ్యక్తం చేశారు. నాటి మనువాదం దళితులను అంటరాని వాళ్ళుగా చూపి చదువుకు, ఆస్తికి, అవకాశాలకు దూరంగా ఉంచిందని, నేడు భారత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి దళితులు ఏ స్థాయిలో ఉన్న దాడులు దౌర్జన్యాలు చేస్తామనేందుకు సంకేతమాని వారు విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు వై నగేష్, అబ్దుల్ దేశాయ్, కెవిపిఎస్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఏసురాజు, రమణ, నాయకులు సుధాకరప్ప, సాయిబాబా, ప్రభాకర్, రామాంజనేయులు, కుమార్, హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏ క్యాంపులోని హార్టికల్చర్ హాల్ లో మంగళవారం వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిఒక్కరూ వృద్ధుల గౌరవించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాష్ట విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమ, సిల్వర్ జూబ్లీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ నాగరాజు, వయో వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## మానవతా విలువలను పెంపొందించుకోవాలి



**– నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని, ఆయన రచన మానవజాతికి ఉన్నతమైన ఆదర్శాలను, నైతిక విలువలను బోధించే మధుర కావ్యం అని వివరించారు. వాల్మీకి సామాజిక వర్గంలో పుట్టడం మా అదృష్టమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఆర్వో స్వర్ణలత, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, స్వర్ణలత, రామకృష్ణ, డి.ఎస్.ఓ. కృష్ణమోహన్, సిబ్బంది శ్రీనివాసులు, రామాంజి, నూర్ అహ్మద్, షబానా, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడి అమానుషం

మనగళం, కర్నూలు సిటీ : సుప్రిం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది తన షూ విసిరడం అమానుషమని కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ ఎస్.ఉమాదేవి ఒక ప్రకటనలో ఖండించారు. మతోన్మాద శక్తులు చేస్తున్న, విష సంస్కృతి, విద్వేషం వల్లనే నేడు ఇలాంటి సంఘటనలు జరగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి

**– మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు**




మనగళం, కర్నూలు సిటీ : భారత ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బి.ఆర్.గవాయ్ పైన దాడికి పాల్పడిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ మెంబర్ ఎం సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. న్యాయ చరిత్రలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాది షూతో దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ దళిత జాతికి చెందిన ప్రధాన న్యాయమూర్తి పై న్యాయవాది బూటు విసరడం జరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, కోడుమూరు మైనార్టీ నాయకులు వసి బాషా, నాయకులు జాన్ సదానందం, నవీన్ మొదలగువారు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు జడ్జ్ పై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై సనాతన ధర్మం పేరుతో షూ విసరడాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ భాష అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడిందని, దానికి నిదర్శనమే సీజేఐ వీఆర్ గవాయి పైన దాడి అని ఆందోళన వ్యక్తం చేశారు. బరితెగించి సీజెఐను అవమానించిన వ్యక్తి పైన క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నాయకులు ఆర్యన్, సాయి, యువరాజ్, సందీప్, ప్రదీప్, విజయ్, దివాకర్, ప్రశాంత్ ,శ్రీహరి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి

మనగళం, కర్నూలు సిటీ : సుప్రీంకోర్టులో సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి (సీ జే ఐ) బీ ఆర్ గవాయ్ పై దాడికి పాల్పడిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఎస్ ఏ సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యులు, పి ఇక్బాల్ హుస్సేన్, ఎస్ ఎం డి షరీఫ్ డిమాండ్ చేవారు. సోమవారం ఉదయం కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. జస్టిస్ కె వినోద్ చంద్రన్ తో బీ ఆర్ గవాయ్ కూడిన ధర్మాసనంలో కేసు విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా తన స్పోర్ట్స్ షూ తీసి సీ జే ఐ పై కి విసేరాడాన్ని వారు ఖండించారు. ఈ సంఘటన భారత రాజ్యాంగాన్ని, దేశ ప్రజలను అవమానించినట్లే అని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## వయోవృద్ధులను గౌరవించాలి




మనగళం, కర్నూలు సిటీ : వయోవృద్ధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని, వారి బాగోగులు చూడడం కుటుంబ సభ్యుల బాధ్యత అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి తెలిపారు. కర్నూలు సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రైస్ ఫాతిమా ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు జిల్లా హార్టికల్చర్ మీటింగ్ హాల్ లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి లీల వెంకట శేషాద్రితోపాటు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆర్డినేటర్ హాస్పటల్ సర్వీసెస్ జఫ్రుల్లా అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా స్థిరపడిన వృద్ధులు సైతం కుటుంబ నిర్లక్ష్యం, పిల్లల నిరాధరణ, ఆస్తుల కోసం వేధింపులు, శారీరక బలహీనత ఆసరాగా దాడులు వంటి బాధాకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే వృద్ధులను ఆదుకోవడానికి అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు ఉన్నాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ చట్టం (2007) ప్రకారం వృద్ధులకు నెలవారీ జీవన భృతి కల్పించాల్సి ఉందన్నారు. వయోవృద్ధుల పోషణ విస్మరిస్తే జరిమానా, జైలుశిక్ష విధించేవిధంగా చట్టం ఉందన్నారు. వృద్ధుల ఆస్తి మీద హక్కు తీసుకుని తరువాత వారిని నిర్లక్ష్యం చేసిన వారసులకి ఆ ఆస్తి మీద హక్కు రద్దు చేసే అధికారం కలదని తెలిపారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ %-% సెక్షన్ 125 క్రింద తల్లిదండ్రులు కోర్టులో కేసు వేసి పిల్లల నుండి జీవనభృతి పొందే అవకాశం కలదని తెలిపారు. న్యాయ, చట్టపరమైన సమస్యలు ఉంటే న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించి ఉచితంగా న్యాయాన్ని పొందవచ్చునని తెలిపారు. వృద్ధులకు ఎవరికైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేస్తే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం జడ్జి వృద్ధులకు సంక్షేమ శాఖ అందించిన బెడ్ షీట్లను అందజేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక
కర్నూల్ న్యూస్
బుధవారం
08 - 10 - 2025
4

# రైతుల నష్టాలపై రాజకీయాలు చేయడం సరికాదు: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

పత్తికొండ, కర్నూలు జిల్లా: రైతులకు ఎదురవుతున్న నష్టాలపై ఆలోచించాల్సింది పోయి, వారు ఏ రాజకీయ పార్టీకి చెందినవారో అనే విషయంపై చర్చించడం సరైనది కాదని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు అన్నారు. పత్తికొండలో తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఉల్లి, టమోటా పంటలు పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిని తెలియని వారు ఎవరూ లేరని పేర్కొన్నారు. పెట్టిన పెట్టుబడి భారమై, గిట్టుబాటు ధర లేక రైతులు పంటను పొలంలోనే వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "టమోటాకు ఒకరోజు మంచి ధర వస్తే, తర్వాత రెండు రోజులు ధర పడిపోతోంది. ప్రభుత్వం మద్దతు ధర కిలోకు 8 రూపాయలుగా ప్రకటించి మాట ఇచ్చినా, అమలు మాత్రం జరగడం లేదు" అని శ్రీదేవమ్మ గారు విమర్శించారు. గత ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం నిర్మాణం చేపట్టిన టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని స్థల మార్పిడి చేసి ఆలస్యం చేయడం సబబు కాదని ఆమె సూచించారు. అలాగే, పత్తికొండ పట్టణ రోడ్డు విస్తరణకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించి పనులు ఆగిపోయాయని, దీనివల్ల భారీ వాహనాలు పట్టణంలోకి వచ్చి ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆరోపించారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు



వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల నాయకులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు, ఎంపీపీ, మండల కన్వీనర్లు, కమిటీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మైనారిటీ సోదరులు, వార్డ్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన భద్రత చర్యలపై సమీక్ష

మనగళం, కర్నూలు క్రైం : ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా ఐజీపీ ఆర్.కె రవికృష్ణ ఆధ్వర్యంలో శ్రీశైలంలోని పరిపాలన విభాగం నందు గల మీటింగ్ హాల్ నందు భద్రత ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్.కె రవికిష్ణ గారితో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రేహౌండ్స్ డిఐజి బాపూజీ , నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ప్రకాశం ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిజిపి ఆఫీస్ అధిరాజ్ సింగ్ సింగ్ రాణా, ఈజీ అశోక్ కుమార్, సిఐడి ఎస్పీ శ్రీధర్ రావు, అదనపు ఎస్పీ యుగంధర బాబు, ఆత్మకూరు డీఎస్పి రాంజీనాయక్, శ్రీశైలం సీఐ ప్రసాదరావు తదితరులతో ఆర్.కె రవికృష్ణ చర్చించారు. ప్రధానమంత్రి రాక సందర్భంగా హెలిపాడ్స్, రూట్ బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవలసిన చర్యలు, ముఖ్యమైన ప్రాంతాలలో ఏర్పాటు చేయవలసిన పికెట్లు, చెక్ పోస్ట్ లు తదితర అంశాలపై చర్చించారు. ప్రధానమంత్రి పర్యటించే ప్రదేశాలలో భద్రత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష నిర్వహించడం జరిగింది.

## ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



మనగళం, కర్నూలు సిటీ : ఐక్య ఉద్యమాల ద్వారానే మహిళా సమస్యల పరిష్కారం అవుతాయని ఐద్వా సీనియర్ నాయకురాలు పి. నిర్మల అన్నారు. ఐద్వా12వ జిల్లా మహాసభల సందర్భంగా ముందుగా సీనియర్ నాయకురాలు నిర్మల జెండా ఆవిష్కరణ చేశారు. మంగళవారం స్థానిక కార్మిక కర్షక భవన్లో మహాసభ ప్రారంభానికి ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు మహిళా ఔన్నత్యాన్ని గురించి గేయాలను ఆలపించారు. అనంతరం జరిగిన సభకు అరుణమ్మ, ధనలక్ష్మి, రషీదా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా అరుణమ్మ గత మూడు సంవత్సరాలుగా అమరులైన నాయకులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం సభను ఉద్దేశించి పి నిర్మల మాట్లాడుతూ ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని చెప్పారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తూ మహిళలను వంటింటిదే పరిమితం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని,తీర్మానాలు చేసుకొని కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చా రు. అనంతరం అనంతరం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు మాట్లాడుతూ ఉపాధి పనులను గ్రామాల్లో పట్టణాల్లో కల్పించాలని చెప్పారు. సమావేశంలో సీనియర్ నాయకురాలు ఈ ఎల్ ఎస్ రత్నమ్మ, ఉమాదేవి, పిఎస్ సుజాత, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

## అధికారులు పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలి

మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో ప్రధానమంత్రి మోడీ పర్యటనకు సంబంధించి రాష్ట్ర స్థాయి అధికారులతో జిల్లా అధికారులు సమన్వయం చేసుకోవాలని ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీర పాండియన్ ఆదేశించారు. మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, విధులు కేటాయించిన అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి కార్యక్రమం నిర్వహించేందుకు రాష్ట్రస్థాయి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. వీరంతా గతంలో ప్రధానమంత్రి పర్యటన కార్యక్రమాల విధులను నిర్వర్తించిన వారన్నారు. జిల్లాస్థాయిలో జిల్లా అధికారులకు విధులు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి అధికారులతో జిల్లా అధికారులు మాట్లాడి, కోఆర్డినేట్ చేసుకుని విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. విధుల నిర్వహణలో స్పష్టత కలిగి ఉండాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి ఆయా ఏర్పాట్లకు సంబంధించి విధులు కేటాయించిన అధికారులతో మాట్లాడారు. పార్కింగ్ కు సంబంధించి 11 ప్రదేశాలు ఏర్పాటు చేశామని, ఇందుకోసం వివిధ శాఖల అధికారులను ఇన్చార్జిలుగా నియమించామని, వివిధ జిల్లాల నుండి తెప్పించిన జెసిబి లతో ఈ ప్రాంతాల్లో త్వరితగతిన లెవెలింగ్, బుష్ క్లియరెన్స్ వంటి పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



## సున్నిపెంటలో ఆటో డ్రైవర్ల సేవా పథకం- కృతజ్ఞతగా ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ

మనగళం, శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించిన సందర్భంగా కృతజ్ఞతగా.. సున్నిపెంట గ్రామంలో ఆటో డ్రైవర్లతో ర్యాలీ రింగు పర్కు



సెంటర్ నందు జెండా ఊపి భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాగాళ్ల సురేష్, గ్రామ అధ్యక్షుడు ఎస్.కె.సుభాన్, ప్రచార కార్యదర్శి మల్లేష్ అలాగే మండల నాయకులు సుబ్బారెడ్డి జావిద్, నజీర్, ప్రవీణ్ తేజ,అబ్బిరెడ్డి మరియు ఆటో డ్రైవర్లు ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.



## పర్లలో ఘనంగా వాల్మీక జయంతి

మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని పర్ల గ్రామంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. పర్ల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వాల్మీకి మహర్షి త్యాగాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు ఐకమత్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు.





# పత్తికొండ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగనవాడి పౌష్టికాహారం పోషణ నిర్వహించరు



– ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్



మన గళం : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ అన్నారు.పత్తికొండ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగనవాడి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహారం పోషణ కార్యక్రమంలో పాల్గొన్నారు .పత్తికొండ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఏర్పాటు చేసిన పోషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ పాల్గొన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల మానసిక ఆరోగ్య పెరుగుదలకు పోషకాహార అవశ్యకత పై గర్భిణీ,బాలింతలకు అవగాహన కల్పించారు. అందుబాటు ధరల్లో దొరికే జామ,మునగ, ఆకు కూరలు, కాయకూరలు వంటి పోషక విలువలుతో కూడిన ఆహార పదార్థాలు విరివిగా తీసుకొని,ఆరోగ్య వంతుమైన జీవితం గడపాలని గర్భిణీ, బాలింతలు కు వివరించారు. పుట్టిన వెంటనే చిన్నారుల వ్యాధి నిరోధకశక్తి కి తల్లి పాలు దోహదపడతాయనీ సూచించారు. అనంతరంఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన



పోషక విలువలుతో కూడిన పిండివంటల ను పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

రచయితలు ప్రజలకు పనిచేయడం వారి సామాజిక బాధ్యత

నడుస్తున్న చరిత్రను వ్యంగ్యంగా మలి చి ప్రజా గొంతుకగా పనిచేసిన రచయితలు,సామాజికవేత్తలు, చరిత్రకారులు, కార్టూనిస్టులు, మేధావులు, విశ్లేషకులు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులు ప్రజల మేలు కోసం సామాజిక మనుగడ కోసం మరింత ఉత్తమమైన సమాజం కోసం అంతిమంగా సమసమాజ స్థాపన కోసం పనిచేస్తారు అనడంలో సందేహం లేదు. ఒకవేళ ఆయా రంగాలకు చెందిన వాళ్లు తమ సామాజిక బాధ్యతను విస్మరించినట్లయితే వ్యవస్థకు తన పదవికి అంతిమంగా మానవ జన్మకి ద్రోహం చేసినట్లుగా భావించవలసి ఉంటుంది. ఎందుకంటే స్వార్థ స్వప్రయోజనం, గుండాయిజం, రౌడీయిజం, రాక్షస రాజ్యం,అత్యాచారాల పర్వం, దోపిడీ పీడన, వంచన, ఆధిపత్యం,అహంభావం వంటి అనేక అవలక్షణాల కారణంగా సమాజం ఇప్పటికీ చాలా భ్రష్టు పట్టిపోయింది. ఈ సమాజాన్ని బాగు చేయడానికి రచయితలు కవులు మేధావులు విశ్లేషకులు సామాజిక కార్యకర్తలు కూడా ఎవరి దారిన వాళ్ళు కష్టపడి పనిచేస్తున్నారు. వ్యవస్థ బాగు కోసం ఉమ్మడిగా కూడా ఆరాటపడుతున్నారు. ఆ ఆరాటం లేకుండా కేవలం నటనతో జీవించేవాళ్లు ఈ దేశానికి ద్రోహం తలపెట్టే వాళ్ళు. "అదే సందర్భంలో పాలకులు కూడా ప్రజల కంటే మిన్నగా తమ స్వప్రయోజనాలను, అధికార దాహాన్ని, వర్గ ప్రయోజనాన్ని, అధికారాన్ని శాశ్వతం చేసుకునే క్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆ కారణంగా కూడా రాజకీయ సామాజిక చారిత్రక రంగాలలో ఏర్పడుతున్నటువంటి లోపాన్ని సవరించడం కూడా మేధావులకు బుద్ధి జీవులకు అదనపు బాధ్యతగా మారిపోతున్నది. "ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా నిజము మరిచి నిద్రపోకుమా" అని ఒక వైపు ప్రముఖ విప్లవ రచయిత శ్రీ శ్రీ ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తే ఆ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలను నిరంతరం జాగరూ కులను చేయడానికి ప్రభావితం చేయడానికి మేధావులు, రచయితలు, విప్లవ రచయితలు, సంఘసంస్కర్తలు, సామాజిక కార్యకర్తలు తమ భుజానికి వేసుకొని బాధ్యతను మరింతగా మో స్తున్న విషయాన్ని మనం గమనించాలి. అదే కోవలోకి కార్టూనిస్టులు రచయితలు కూడా వస్తారు అని తెలుసుకోవాలి.

ప్రముఖ కార్టూనిస్టు విశ్లేషకుడు నడుస్తున్న చరిత్రను నిరంతరం గతి తప్పకుండా సంస్కరించడానికి తన జీవితమంతా తోడ్పడినటువంటి కార్టూనిస్టు ఆర్కే లక్ష్మణ్‌ాజకీయ నాయకులకు నేనెంతో రుణపడి ఉన్నాను. వాళ్ల దేశాన్ని పట్టించుకోకపోయినా నన్ను పట్టించుకున్నారు నా కార్టూన్లకు కావలసిన సరుకు ఇచ్చి ప్రజల మధ్యన నేను జీవించడానికి తోడ్పడ్డారు. రాజకీయ నాయకులు గనుక మంచి వాళ్ళు అయితే నీతి నియమావళితో కట్టుబడి ఉండి సుపరిపాలన గనక చేస్తే నా ఉద్యోగం ఊc డిపోయేది ఉద్యోగం మానేయవలసి వచ్చేది"" అని తాను నిర్వహించిన పాత్రను వ్యంగ్యంగా చెప్పడాన్ని గమనించినప్పుడు కార్టూనిస్ట్ ఆర్కే లక్ష్మణ్ గారు నిర్వహించిన సామాజిక బాధ్యత ఎంత గొప్పదో మనకు అర్థమవుతుంది. సమకాలీన సామాజిక రాజకీయ ఆర్థిక చారిత్రక పరిస్థితుల పైన అవగాహనతో వాటిని ప్రభావితం చేయడం ద్వారా సుపరిపాలన అందించవలసినటువంటి ప్రభుత్వాలు ప్రజాస్వామిక దేశంలో ఆ వైపు కన్నెత్తి కూడా చూడకుండా పెట్టుబడి దారి సామ్రాజ్య విధానాలకు తొత్తులుగా వ్యవహరించి సామాన్యుడిని బలి పశువులను చేశాయని అందుకే సామాన్యుని పక్షాన తన జీవితమంతా పనిచేయడానికి టైమ్స్ ఆఫ్ ఇండియాలో 50 సంవత్సరాల తో పాటు ఇతర పత్రికలలో అనేక సంవత్సరాల పాటు కార్టూనిస్ట్ గా పనిచేసి సామాజిక అంశాలను ఎత్తిచూపి రాజకీయ పార్టీల నాయకులకు కనువిప్పు కలిగించిన దార్శనికు నిగా మనం ఆర్కే లక్ష్మణ్ గారిని గుర్తించవలసిన అవసరం ఉంది. "" "రాజు చేతి కత్తిరక్తంబు వర్షించు సుక వి చేతి కలము సుధలు కురియు, అతడేల గల్గు యావత్ ప్రపంచంబు ఈతడేలగలుగు ఇహము పరము" అని జాషువా గారు అన్నట్లు ఒక రచయిత ఒక మేధావి ఒక ప్రజా కోణంలో ఆలోచించగలిగినటువంటి నిపుణుడు పదునైన కలము ద్వారా కత్తి కంటి మిన్న అయినటువంటి సామాజిక మార్పును సాధించగలరని చెప్పడానికి జాషువా గారు వర్ణించిన ప్రకారంగా ప్రజా క్షేత్రంలో పనిచేసిన వారిగా ఆర్కే లక్ష్మణ్ కామన్ మ్యాన్ ను దృష్టిలో ఉంచుకొని చేసిన వారి రచనలు ప్రధాన పాత్ర పోషిస్తుంటే, ప్రభుత్వాల యొక్క వైఫల్యాన్ని ఎత్తిచూపడంలో క్రియాశీలక పాత్ర పోషించడాన్ని మనమందరం అభినందించాలి .కేవలం రచనతోనే వదిలిపెట్టకుండా సామాన్యుల గొంతుకగా వారి సమస్యల పరిష్కారంలో తన బాధ్యతగా స్వీకరించి పాలకులకు దడ పుట్టించినటువంటి కార్టూనిస్టుగా, ప్రజాప్రతినిధిగా వారు భారత దేశంలో సుపరిచితుడు. ఆర్కే లక్ష్మణ్ గారి లాగా ప్రతి వ్యక్తి తనకంటూ ఒక రంగాన్ని నిర్మాణం చేసుకొని సామాజిక బాధ్యతను నిర్వహించడం ద్వారా ఎంతో కొంత మార్పు కోసం కృషి చేయడానికి సిద్ధపడాలి. ఆ రకంగా కాకుండా తన వరకు మాత్రమే పరిమితమైనటువంటి వ్యక్తుల గురించి ఈ వ్యవస్థ పట్టించుకోదు వాళ్ల అవసరం ఈ వ్యవస్థకు కూడా లేదు అని కఠినంగా చెప్పగలిగితే కనువిప్పు కలిగేలా మాట్లాడగలిగితేనే భవిష్యత్తులో లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రజలను జాగ్రత్తపరచడానికి తద్వారా మెరుగైనటువంటి సమాజాన్ని, పాలకులను సా కారం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంబేద్కర్ గారు అన్నట్లు" ""సమాజ హితం కోరనటువంటి పాలకులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ప్రజలు తమకిష్టమైనటువంటి పాలనను తెచ్చుకునే క్రమంలోపల ఉన్న వ్యవస్థను చిదిమి వేస్తారు. ""అని చేసిన హెచ్చరిక ఇప్పటికీ ప్రభుత్వాలకు గుణపాఠం అయితే మంచిదే.

## కోడుమూరు నందు ఘనంగా జరిగిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకల





మన గళం కోడుమూరు: శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి వాల్మీకి మహర్షి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వరం లో వాల్మీకి విగ్రహానికి ఘనంగా పూజ కార్యక్రమం నిర్వహించారు వాల్మీకి జయంతి సందర్భంగా క్రీడా పోటీలు స్లో సైకిల్ రైస్ జంపింగ్ రైస్ తాడాట ముగ్గుల పోటీలు నిర్వహించారు అలాగే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిపారు కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అందరికీ ఆదర్శ దైవం వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్క వ్యక్తి వాల్మీకి మహర్షి అడుగుజాడలో నడవాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో వాల్మీకి మహర్షి విగ్రహ కమిటీ సభ్యులు బలరాముడు లాయర్ ప్రభాకర్ మహేష్ నాగరాజు మధు రామాంజనేయులు రాజు బచ్చ చంటి పూల రాము గుడ్డ మధు అదేవిధంగా టిడిపి నాయకులు టిడిపి కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మధుసూదన్ రెడ్డి హేమాదిరెడ్డి టెలిఫోన్ రాముడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బిపి ఎల్లప్ప నాయుడు గోపాల్ నాయుడు రవీంద్ర గౌడు మాల మహానాడు మునుస్వామి వెంకటగిరి ఎంపీటీసీ నారాయణ డీలర్ కృష్ణ బ్రిటిష్ రాముడు మోడల్ స్కూల్ చైర్మన్ మధు వర్కూర్ అయ్యప్ప రాజోలు గిడ్డయ్య బిజెపి మండల కార్యదర్శి కప్పట్రాళ్ల మహేష్ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు

## రామాయణ మహాకావ్య సృష్టికర్త శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలోని కోడుమూరు పట్టణంలో మరియు గూడూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షీ వాల్మీకి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యులు, మాజీ కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కొనియాడారు. మహర్షీ వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం కోడుమూరు, గూడురు మండల కేంద్రాల్లో శ్రీ వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహాన్ని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక సామాన్య వ్యక్తిగా పుట్టిన బోయవాడు.. అడవిలో పెరిగి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షీగా మారాడని అన్నారు. భవిష్యత్తు తరాలకు రామాయణ మహా గ్రంధాన్ని అందించిన మహర్షి వాల్మీకి బోయ కులంలో జన్మించి తన తపస్సు వలన ఋషిగా మారారని, సుమారు 23 వేల శ్లోకాలతో రామయాణాన్ని రచించారని పేర్కొన్నారు. సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి రామాయణ మహాకావ్యం బాటలు వేస్తుందని, ఇంతటి మహోన్నత గ్రంథాన్ని అందించిన వాల్మీకిని ప్రతీఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, కోడుమూరు నియోజకవర్గల అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ రఘునాథ్ రెడ్డి, గూడూరు పట్టణ మున్సిపల్ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం, వైఎస్ఆర్సీపీ జిల్ ఉప అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోడుమూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు, కౌన్సిలర్ కుమార్, కోడుమూరు మండల కన్వీనర్ రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి.



మన గళండోన్ ఆశ వర్కర్స్ గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు, గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు,వివిధ రోగాలతో ఉండినా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆశ వర్కర్స్ కు కనీస వేతనాలు పెంచాలని %ూఎజ% సెంటర్ ఇన్చార్జి మాధవి మేడం గారికి మో మొ రాండం ఇవ్వడం జరిగినది.%జ%ుఖ% ప్యాపిలిమండల ప్రధాన కార్యదర్శి %ూ.ూ%. చిన్న రహిమాన్, సహాయ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వ నాయకులు ఆశ వర్కర్స్ వేతనాలు పెంచుతామని వాగ్దానం చేశారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న నేటికీ ఆశా వర్కర్స్ కు వేతనాలు పెంచడం లేదు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో పోటీపడి పిల్లల వైద్య ఖర్చులు విద్యార్థులు విద్య ఖర్చులు భరిస్తూ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. ఆశా వర్కర్స్ కు అన్ని రకాల జాతీయ సెలవులు పండగ సెలవులు వారంతపు సెలవులు క్యాజువల్ సెలవులు మెడికల్ లీవ్స్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. దహన సంస్కారాలకు 20వేల రూపాయలు చెల్లించాలని ఫైవ్ జిబి మొబైల్స్ సిమ్ కార్డు ఇవ్వాలని. నాన్నమైన యూనిఫారం ఇవ్వాలని పిహెచ్సి లకు వెళ్లిన ప్రతి సందర్భంలో టీఏడీఏ ఇవ్వాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఏఎన్ఎం జి ఎన్ ఎం శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలకు పర్మినెట్ పోస్టులు సందర్భంగా ప్రాధాన్యత ఇవ్వాలి. పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఆశా కార్యకర్తలు నియామకం పెంచాలని ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలని వారు కోరారు. గిరిజన గూడెంలలో పనిచే స్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను పాఠశాలల్లో మార్పు చేసి ఆశాలతో పాటు సమానంగా వేతనాలు ఇవ్వాలని ప్రమాదంలో గాని అనారోగ్యంతో గాని మరణించిన ఆశ కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆశ వర్కర్స్ పై రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశా కార్యకర్తలకు వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ షమీముల్లా గారు కెవిపిఎస్ మండల నాయకులు రాజకుమార్, ప్రతాప్, భాగ్యలక్ష్మి, కృష్ణకుమారి, దేవమ్మ, పీరాంబి, కవిత, కమల, సునీత, నాగవేణి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టి. సోమల గూడూరులో తితిదే ధార్మిక కార్యక్రమాలు




మనగళం, నందవరం : శ్రీమద్రామాయణం వాల్మీకి మహర్షి సమకాలీన జీవిత చరిత్రని, స్వయంగా సీతారాముల ఆదర్శ ప్రేమమయమైన జీవితాన్ని దర్శించిన ఒక మహా ఋషిపుంగవుడం వాల్మీకి అని, ఇంతటి గొప్ప కవి ప్రపంచంలో ఎక్కడా కానరాడని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నందవరం మండలం, సోమలగూడూరు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నృశింహస్వామి దేవస్థానంనందు ఐదురోజుల ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీమద్రామాయణంలోని ఒదర్శాన్ని వివరించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, ధార్మిక ప్రవచకులు సి.తులశమ్మ చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కె.రుక్మాంగధరెడ్డి, కే ఆనంద రెడ్డి, గ్రామ సర్పంచ్ యం.గోవిందు, ఆలయ ధర్మకర్త తెలుగు వీరేష్, టి.లక్ష్మన్న, శ్రీనివాసులు, టి గోపాల్, టి రామచంద్ర, టి నాగేష్, బుడ్డ గోకారి, రామలింగప్ప, తిక్కయ్య పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని సనాతన మతోన్మాదుల నుండి కాపాడుకుందాం

## - సిజెఐ పై దాడిని ఖండించండి:-సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్. డోన్

మన గళండోన్ దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై సనాతన మతోన్మాదం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన అత్యంత ఆందోళనకర ఘటన దేశంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,పట్టణ కమిటీ సభ్యులు చిన్న రహిమాన్, ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం.అన్నారు.మంగవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకు భయం లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఈ హఠాత్పరిణామంతో కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. కాగా దాడి చేసిన వ్యక్తి సనాతన ధర్మానికి అవమానం జరిగితే సహించబోమంటూ కోర్టు హాలులో చేసిన నినాదాలనుబట్టి దాడికి ప్రేరణ ఏమిటో, ఎవరో సులభంగానే బోధ పడుతుందని వారన్నారు. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి.

జస్టిస్ గవాయ్ పై దాడి ఘటన అదేదో సాదాసీదా యాధృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. కేవలం ఒక వ్యక్తి పిచ్చి అంతనకన్నా కాదు. వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్, పరివారం ప్రజల మెదళ్లకు ఎక్కించిన విద్వేష విషం. ప్రజల్లో మత విభజన సిద్ధాంత భావజాల వ్యాప్తిని ఘటన ప్రతిబింబిస్తుంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక వ్యవస్థల ధ్వంసం సైద్ధాంతికంగా ఒక పథకం ప్రకారం సాగుతోంది. న్యాయ వ్యవస్థను సైతం వదిలిపెట్టలేదు. జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. సనాతన ధర్మాన్ని మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకొని ప్రచారం చేస్తున్న తరుణంలో, జస్టిస్ గవాయ్ పై దాడుల వంటివే సనాతన ధర్మమా? మోడీ, బిజెపి సమాధానం చెప్పాలి. మన రాష్ట్రంలో సనాతన ధర్మంపై ప్రచారం చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్, చీఫ్ జస్టిస్‌పై సనాతన వాది దాడిని ఖండిస్తారా, లేక మద్దతిస్తారో స్పష్టం చెప్పాలని వారు ప్రశ్నించారు.

జస్టిస్ గవాయ్ దళిత కులానికి చెందిన వారైనందున, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ అయిన దగ్గర నుంచీ సంఘ్ పరివారం, బిజెపి ఆయన్ని లక్ష్యంగా చేసుకొని వ్యతిరేక ప్రచారం లంకించుకున్నాయి. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో




తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. జస్టిస్ గవాయ్ తల్లిదండ్రులపై మహారాష్ట్రలోని సంఘ్ పరివార్ మూకలు సోషల్‌మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తుండటంపై వారు బహిరంగంగా నిరసన తెలియజేశారు. మొన్న అక్టోబర్ 5న మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతవార్షికోత్సవానికి రావాలన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్లు గవాయ్ తల్లి ప్రకటించారు. బీహార్ ఓటర్ల సవరణ, గవర్నర్ల వ్యవహారశైలి తదితరాలపై గవాయ్ జారీ ఉత్తర్వుల నేపథ్యంలో రాజకీయ కారణాలు కూడా ఆయనపై దాడికి పురిగొల్పి ఉండవచ్చు. ఈ పూర్వరంగంలో చూస్తే గవారుపై ఉద్దేశపూర్వకంగానే సంఘ్ పరివారం, బిజెపి పగబట్టి వెంటబడి వేధిస్తున్నాయని అర్థమవుతుంది. ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమన్న పరివార్ హెచ్చరికగా గవాయ్ పై దాడిని పరిగణించాలి. కోర్టు హాలులో గవారుపై దాడిని అగ్రకుల సనాతన ఉన్మాద సంస్కృతిలో భాగంగా చూడాలి. విభజన, విషపూరిత రాజకీయాల ప్రభావంతో సాగుతున్న విద్వేష చర్యలను అందరూ కలిసి సమర్ధవంతంగా ఎదుర్కోవాలని వారన్నారు.

## సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోజీఎస్టీ పై అవగాహన మరియు వ్యాసరచన పోటీల నిర్వహణ

మనగలం : నంద్యాల జిల్లా సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పద్మ గారి అధ్యక్షతన "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" (జిఎస్టి 2.0) పైన విద్యార్థినీ విద్యార్థులకు మరియు అధ్యాపకులకు అవగాహన సదస్సును కామర్స్ డిపార్ట్మెంట్ వారు మంగళవారం నాడు నిర్వహించటం జరిగింది. దానిలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. జీఎస్టీ సేవింగ్స్ పైన క్రొత్తగా వచ్చినటువంటి జిఎస్టి తగ్గింపుల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కే. రాజన్న, శ్రీ ఎస్. మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎస్. శివ నాగిరెడ్డి, శ్రీమతి టి. ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వై. కిరణ్ కుమార్, కుమారి షాహిదా, శ్రీమతి మీనాక్షి మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## నగరం అభివృద్ధే లక్ష్యం

- రూ.4.33 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన
- దశాబ్దాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం
- నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరం అభివృద్ధే తమ లక్ష్యం అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం నగరంలోని వివిధ వార్డుల్లో రూ.4.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కూడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. 48వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ కాలనీలో సీసీ రోడ్లు, 13వ వార్డులో బసవా సర్కిల్ వద్ద సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులు, 8వ వార్డులో పెద్దపదకాన మైదానం వద్ద మహిళల కమ్యూనిటీ టాయిలెట్, మోతియా హైస్కూల్ వెనుకభాగంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే 17వ వార్డు జోహరాపురంలో సీసీ రోడ్ల నిర్మాణం, 18వ వార్డులో పబ్లిక్ టాయిలెట్ పునర్నిర్మాణం, 24, 25వ వార్డులకు సంబంధించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్ పునరుద్ధరణతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో డివైడర్లకు పెయింటింగ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి వార్డులో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దశాబ్దాలుగా ఉన్న ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ పి. విశ్వనాథ్ నిజాయితీగా, కఠినంగా పనిచేస్తున్నారని, దీన్ని ఓర్వలేక కొందరు పనిగట్టుకుని పత్రికల్లో వార్తలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పనులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని, బాగా పనిచేస్తే ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎగ్జామినేషన్ గ్రౌండ్‌ను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. పట్టాల పంపిణీలో అనేక నిబంధనలు సడలించి, వేలాది కుటుంబాలకు ప్రయోజనం కలిగించామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు కూడా బిల్లులు కూడా చెల్లించామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపి హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి, కార్పొరేటర్లు క్రైప పద్మలత రెడ్డి, కురబ పరమేష్, జె.రమణమ్మ, డిఈఈ గంగాధర్, క్రిష్ణలత, ఏఈ రాంమోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ చెల్లింపుల రంగంపై దృష్టి..
## పీఓఎస్ డివైజ్‌లను లాంచ్ చేసిన జోహో



మనగలం : డిజిటల్ చెల్లింపుల రంగంలో పాతుకుపోయిన ఫోన్ పే, జీపే, పేటీఎమ్‌కు సవాలు విసిరేందుకు అరట్టై రూపకర్త, జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు సిద్ధమయ్యారు. ఆయన సారథ్యంలోని జోహో తాజాగా పాయింట్ ఆఫ్ సేల్ డివైజ్‌లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. వీటి సాయంతో వ్యాపారులు కస్టమర్ల నుంచి నేరుగా చెల్లింపులు స్వీకరించగలుగుతారు. తన సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్‌తో ఈ డివైజెస్‌ను ఏకం చేయాలనే వ్యూహంతో సంస్థ ముందుకెళుతోంది. దేశీ యాప్ అరట్టైతో జోహో పే చెల్లింపుల వ్యవస్థను త్వరలో అనుసంధానం చేస్తామని శ్రీధర్ వెంబు తెలిపారు. ఎమెంట్ ఎగ్రిగేటర్ సేవలు అందించేందుకు గతేడాది జోహోకు ఆర్బీఐ అనుమతులు లభించాయి. ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి పలు సాఫ్ట్‌వేర్‌లతో కూడిన ప్రత్యేక సూట్‌ను జోహో ఇప్పటికే లాంచ్ చేసింది. ఇక తాజా పీఓఎస్ డివైజులతో వ్యాపారులు కస్టమర్ల నుంచి డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, యూపీఐ, మొబైల్ వాలెట్ల ద్వారా డబ్బులు స్వీకరించగలుగుతారు. గ్లోబల్ ఫిన్ టెక్ రంగం, డిజిటల్ చెల్లింపుల సాధనాలపై తాము దృష్టిపెట్టినట్టు శ్రీధర్ వెంబు తెలిపారు. ఈ దిశగా ఎన్‌పీసీఐకి చెందిన ఎన్‌బీబీఎల్‌తో తాము భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. భారత చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు, వ్యాపార వర్గాలకు చెల్లింపుల విధానాల్లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఇదిలా ఉంటే, జోహోకు చెందిన అరట్టై యాప్‌కు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. రోజువారి కొత్త సైనప్‌ల సంఖ్యలో ఇటీవల దాదాపు 100 రెట్ల వృద్ధి కనిపించింది. ఈ డిమాండ్‌ను తట్టుకునే విధంగా జోహో సంస్థ తక్షణ ప్రాతిపదికన మౌలిక వసతులను సమకూర్చుకుంటోంది

## మళ్లీ జోష్‌లో స్టాక్ మార్కెట్లు..
## రికార్డ్ స్థాయిలో నిఫ్టీ, ఇన్వెస్టర్లకు ఊరట




మనగలం : భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టి రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది.

## బంగారం హై జంప్.. ఒక్కరోజే 2,700 పెరిగిన తులం ధర

మనగలం : న్యూఢిల్లీ, అక్టోబర్ 6: సామాన్యులను ఊరిస్తున్న బంగారం.. సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.2,700 ఎగిసి, మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,23,300 పలికింది. దీంతో భారతీయ స్పాట్ మార్కెట్‌లో నయా ఆల్‌టైమ్ హై రికార్డు నమోదైనట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం రూ.1,20,330గా ఉన్నది. సోమవారం రూ.1,370 పెరిగింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.1,250 ఎగిసి రూ.1,10,700 వద్ద నిలిచింది. ఇక కిలో వెండి ధర ఢిల్లీలో రూ.1,57,400గా నమోదైంది. ఈ ఒక్కరోజే రూ.7,400 పుంజుకోవడం గమనార్హం. హైదరాబాద్‌లో మాత్రం రూ.1,53,100గా ఉన్నట్టు జ్యుయెల్లర్స్ తెలిపారు. పండుగ సీజన్ దృష్ట్యా సాధారణ కొనుగోలుదారుల నుంచి వెండికి డిమాండ్ ఉందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. అలాగే పరిశ్రమల నుంచి కూడా ఆదరణ కనిపిస్తున్నదని, దీంతో ధరలు దౌడు తీస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. కిలో వెండి రేటూ రూ.1,80,000 దాటుతుందనే అంచనాలున్నాయి. ఇప్పటికే ఫ్యూచర్ మార్కెట్‌లో రేట్లు భగ్గుమంటున్నాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై డిసెంబర్ డెలివరీకిగాను 10 గ్రాములు రికార్డు స్థాయిలో రూ.1,20,075 పలికింది. అలాగే కిలో వెండి రూ.1,47,977 పలికింది. దీంతో ఇప్పుడు ఈ స్థాయిలకు మించి ధరలున్నా.. మున్ముందు పెద్దగా కరెక్షన్‌కు అవకాశాల్లేవన్న సంకేతాలైతే వస్తున్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఉస్తాద్ వచ్చేది అప్పుడేనా?



మన గళం, సినిమా 'ఓజీ'తో ఘనవిజయాన్ని అందుకున్న పవన్‌కల్యాణ్.. అదే జోష్‌లో తన నెక్ట్స్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని కూడా పూర్తి చేసేశారు. రీసెంట్‌గా ఆ సినిమాకు సంబంధించిన పవన్ పార్ట్ కంప్లీట్ అయ్యింది. ఇక డబ్బింగ్ చెప్పడమే తరువాయి. మరోవైపు దర్శకుడు హరీశ్‌శంకర్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని కూడా శరవేగంగా కనిచ్చేస్తున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే విడుదల తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ని ఇప్పటికే షురూ చేశారు. విడుదల తేదీ ప్రకటించగానే ప్రమోషన్స్‌ని వేగవంతం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. శ్రీలీల, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు.

# మళ్లీ మొదటికొచ్చిన చర్చ!



మన గళం, సినిమా దశాబ్దాల తర్వాత ఒకే తెరపై కనిపించనున్న సూపర్‌స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ సినిమాపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ భారీ మల్టీస్టారర్‌కు యువ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ దర్శకత్వం వహిస్తారంటూ వచ్చిన వార్తలకు ఆయన స్వయంగా తెరదించారు. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే దానిపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. కోలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ భారీ మల్టీస్టారర్‌కు దర్శకుడిగా తొలుత లోకేశ్ కనగరాజ్ పేరు వినిపించింది. అయితే ఇటీవల యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ పేరు తెరపైకి వచ్చింది. ఈ ప్రచారంపై ఆయన ఇటీవల స్పష్టత ఇచ్చారు. తన సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈ విషయంపై మాట్లాడిన ప్రదీప్, ఆ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. "ప్రస్తుతం నేను దర్శకత్వంపై దృష్టి పెట్టడం లేదు. నా పూర్తి ఫోకస్ నటనపైనే ఉంది. ఆ ప్రాజెక్ట్ గురించి ఎక్కువగా మాట్లాడలేను" అని ఆయన తేల్చిచెప్పారు. అయితే, ఒకవేళ మిమ్మల్ని ఆ ప్రాజెక్ట్ కోసం సంప్రదిస్తే ఏం చేస్తారని ప్రశ్నించగా, ఆయన మౌనంగా ఉండిపోయారు. ప్రదీప్ రంగనాథన్ క్లారిటీతో ఈ ప్రాజెక్టుకు దర్శకుడు ఎవరనే దానిపై మళ్లీ సస్పెన్స్ నెలకొంది. ఆయన ప్రకటనతో చిత్రబృందం మరో దర్శకుడి కోసం అన్వేషణ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు కమల్ హాసన్ మాత్రం 'థగ్ లైఫ్' వంటి చిత్రంతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈ మల్టీస్టారర్ ఇద్దరి కెరీర్‌కు కీలకం కానుండగా, ఇంతటి భారీ ప్రాజెక్టుకు ఎవరు దర్శకత్వం వహిస్తారోనని కోలీవుడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి

# 'మిత్ర మండలి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కి వెన్యూ ఖరారు

మన గళం, సినిమా టాలీవుడ్ యువ నటుడు ప్రియదార్శి ఇటీవలే తన తదుపరి చిత్రాన్ని విజయేందర్ ఎస్ దర్శకత్వంలో చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ 'మిత్ర మండలి' అనే టైటిల్ ని లాక్ చేసారు. రాగ్ మయూర్, విష్ణు ఓయి మరియు ప్రసాద్ బెహారా కూడా ఈ సినిమాలో ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో నిహారికా ఎన్ %వీ% మహిళా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ సినిమా యొక్క ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగల్ మరియు టీజర్ మూవీ పై భారీ హైప్ ని సృష్టించాయి. ఈ సినిమా యొక్క ట్రైలర్ ని అక్టోబర్ 7న ఉదయం 11:07 గంటలకి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. తాజాగా ఇప్పుడు ఈ లాంచ్ ఈవెంట్ ఈరోజు ఉదయం 10 గంటల నుండి %ూూూ% సినిమాస్ లో నిర్వహిస్తున్నట్లు అంతేకాకుండా ఈ లాంచ్ ఈవెంట్ కి లిటిల్ హార్ట్స్ బృందం హాజరుకానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ సినిమాకి ఆర్ఆర్ ధ్రువన్ సంగీతాన్ని కంపోజ్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని బన్నీ వాస్ తన కొత్తగా ప్రారంభించిన బ్యానర్ బివి వర్క్స్ కింద ప్రదర్శిస్తున్నారు మరియు సప్త అస్వా మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పై నిర్మాతలు కళ్యాణ్ మన్ మంతీనా, భను ప్రతాపా మరియు డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 16న విడుదల కానుంది.




# ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయిన జాన్వీకపూర్

మన గళం, సినిమా హిందీ,తెలుగుతోపాటు ఇండియావైడ్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. దేవర సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చిన ఈ భామ ఇటీవలే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. జాన్వీకపూర్ నటించిన తాజా చిత్రం ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద మిక్స్ డ్ టాక్‌తో మొదలై.. నెగెటివ్ రివ్యూస్ తెచ్చుకుంది. అక్టోబర్ 2న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇప్పటివరకు కేవలం రూ.30 కోట్లు మాత్రమే రాబట్టింది. శషాంక్ ఖైతాన్ డైరెక్ట్ చేసిన ఈ మూవీని బాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించింది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో వరుణ్ ధవన్ హీరోగా నటించాడు. హిందీలో చాలా కాలంగా మంచి కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న జాన్వీకపూర్‌కు ఈ సినిమా తీవ్ర నిరాశనే మిగిల్చిందని తాజా ఫిగర్స్ చెబుతున్నాయి.

ఇక జాన్వీకపూర్ తెలుగులో నటిస్తోన్న రెండో ప్రాజెక్ట్ పెద్దిపైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. స్పోర్ట్స్ డ్రామా బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు



# డిఫరెంట్ ఫొటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది...మృణాల్ ఠాకూర్

మన గళం, సినిమా బాలీవుడ్ ముద్దుగుమ్మ.. టాలీవుడ్ హార్ట్‌త్రోబ్ మృణాల్ ఠాకూర్ తన హాట్‌నెస్‌తో మరోమారు రెచ్చిపోయింది. ఇప్పటికే తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ ముద్దుగమ్మ.. అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంది. సమయం దొరికితే కమర్షియల్ యడ్స్ చూస్తూ రెండు చేతులా ఆర్జిస్తుంది. సామాజిక మాధ్యమాల్లోనూ యాక్టివ్‌గా ఉంటే ఈ చిన్నది తరుచూ తన డిఫరెంట్ ఫొటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది. తాజాగా చేసిన షూట్ ఫొటోలు నెట్టింట దర్శణమివ్వడంతో అంతా షాకవుతున్నారు. కట్-అవుట్-అవుట్ డిజైన్ ప్రత్యేకంగా రూపొందించిన తెల్లటి టెక్స్చర్డ్ గౌన్‌లో వివిధ భంగిమల్లో బోల్డ్‌గా చేసిన ఫొటో షూట్ చూసే వారికి చాలా మందికి కనుల విందు చేయగా మరికొంత మంది మాత్రం డిస్ట్రబ్ అవుతున్నారు.

మృణాల్ ఠాకూర్ ఏంటి ఇలా చేస్తుంది. అవకాశాలు బాగానే ఉన్నాయి కదా ఇప్పుడు ఇలాంటి ప్రదర్శణలు ఎందుకు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదేం ఫొటోషూట్ రా.. ఇలా తయారేంట్రా అని విమర్శలు చేస్తున్నారు.



## పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి



– న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎం.డి. ఫరూక్

మనగళం, నంద్యాల: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కృషి, పట్టుదలతో సాధించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎం.డి. ఫరూక్ అన్నారు. మంగళవారం శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి మంత్రి ఫరూక్, వాల్మీకి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి “ఆదికవి”గా మానవజాతికి చిరస్మరణీయమైన రామాయణాన్ని రచించారని గుర్తు చేశారు. ఆయన జీవితం, ధర్మబోధనలలో నిగూఢమైన మానవతా విలువలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాస కథ మాత్రమే కాకుండా, జీవన విధానానికి మార్గనిర్దేశం చేసే సాహిత్య కావ్యమని అన్నారు. నారద మహర్షి సూచనలతో అడవిలో నివసిస్తూ వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించారని, ఆయన రచనలో ప్రతిఫలించిన ధర్మం, నైతికత, సత్యం, న్యాయం వంటి విలువలు సమాజ నిర్మాణానికి పునాది వేశాయని వివరించారు. యువత వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని కృషి, పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. అంతకుముందు వాల్మీకి సంఘాల నాయకులు గోవింద నాయుడు, బోయ రామకృష్ణ, కాశన్న, వెంకటేశ్వర్లు, గుర్రప్ప, లాలు తదితరులు వాల్మీకి మహర్షి సమాజానికి అందించిన సేవలను వివరించారు.

## ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన సీఐ తేజమూర్తి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కర్నూలు అర్బన్ తాలూకా సీఐగా బాధ్యతలు స్వీకరించిన తేజమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని కేసులు, సమస్యలపై చర్చించారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ నాగరాజు సీఐ తేజమూర్తిని ఆదేశించారు.

## భవిష్యత్ తరాలకు శ్రీరామచరిత్రను అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి



– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

మనగళం, శ్రీశైలం : భవిష్యత్ తరాలకు ఆదర్శ మూర్తి శ్రీరామచరిత్రను అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని, వాల్మీకుల హక్కుల కోసం పార్లమెంట్ లో ప్రస్తావించి ఎస్ టి జాబితాలో చేర్చేలా కృషి చేస్తానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం శ్రీశైల మండలం సున్నిపెంట గ్రామం పోలేరమ్మ గుడి సమీపంలో మండల వాల్మీకి సంఘం సెక్రటరీ నల్లబోతుల మల్లికార్జున ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదికవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి చరిత్ర నేటితరం తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకులను ఎస్ టి జాబితాలో చేర్చాలని తాను పార్లమెంట్ వేదికగా కోరుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. అనంతరం సున్నిపెంట పోలేరమ్మకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు బోయ పక్కిరప్ప, దాసరి మల్లికార్జున, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ





మనగళం, కర్నూలు క్రైం : శ్రీశైలం, కర్నూలుకు అక్టోబర్ 16న ప్రధాని నరేంద్రమోడీ రానున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంధర్బంగా మంగళవారం ఓర్వకల్లు మండలం, నన్నూరు రాగమయూరి లో బహిరంగ సభ, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్, హెలిప్యాడ్ ఏర్పాట్ల ను పరిశీలించారు. బహిరంగసభకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని నలుమూలల నుండి వచ్చే రూట్లను స్వయంగా పరిశీలించారు. జిల్లా పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచనలు చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతాపరమైన అంశాలను, ఇతర ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ కూలంకషంగా ఇతర అధికారులతో చర్చించారు. ప్రజలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రధానమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అధికారులు పూర్తి సమన్వయంతో, సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు ఆర్ డీఓ సందీప్ కుమార్, డీఎస్పీలు, సిఐలు , ఎస్సైలు, ఇంటెలిజెన్స్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అతను రికార్డు పుస్తకాల్లో ఎక్కడం ఖాయం అవుతుంది...విరాట్ కోహ్లీ




మనగళం,ముంబై : ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ ఎంపికైన విషయం తెలిసిందే. అయితే ఆ సిరీస్‌లో ఒకవేళ కోహ్లీ రాణిస్తే అతని ఖాతాలో ఓ కొత్త రికార్డు చేరనున్నది. 2025 చాంపియన్స్ ట్రోఫీలో ప్రదర్శించిన ఫామ్‌ను కొనసాగిస్తే అప్పుడు అతను రికార్డు పుస్తకాల్లో ఎక్కడం ఖాయం అవుతుంది. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్లలో ప్రస్తుతం కోహ్లీ మూడవ స్థానంలో ఉన్నాడు. ఒకవేళ అతను రాబోయే వన్డే సిరీస్‌లో మరో 54 పరుగులు చేస్తే, అప్పుడు అతను రెండోవ స్థానానికి చేరుకుంటాడు. వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్లలో సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కోహ్లీ ఇప్పటి వరకు 302 వన్డేలు ఆడాడు. వాటిల్లో అతను 14,181 రన్స్ చేశాడు. సచిన్ టెండూల్కర్ వన్డేల్లో 18,426 రన్స్ చేశాడు. ఇక సంగక్కర 14,234 రన్స్ చేశాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మరో 54 పరుగులు చేస్తే, ఆల్ టైం లిస్టులో అతను రెండవ స్థానానికి చేరుకుంటాడు. అయితే ఏడు నెలల బ్రేక్ తర్వాత కోహ్లీ మళ్లీ వన్డేలు ఆడుతున్నాడు. 2025 చాంపియన్స్ ట్రోఫీలోఅతను 54 సగటుతో 218 రన్స్ స్కోరు చేశాడు. టీ20, టెస్టు క్రికెట్‌కు విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం అతను వన్డే ఫార్మాట్‌పై ఫోకస్ పెట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై విరాట్ 29 వన్డేలు ఆడాడు. వాటిల్లో కోహ్లీ 1327 రన్స్ స్కోరు చేశాడు. దాంట్లో అయిదు సెంచరీలు, ఆరు ఫిఫ్టీలు ఉన్నాయి.

## ఇండియాతో సిరీస్.. ఆసీస్ వన్డే, టీ20 కెప్టెన్‌గా మిచెల్ మార్ష్



మనగళం, సిడ్నీ: ఇండియాతో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా తమ జట్లను ప్రకటించింది. గాయం నుంచి కోలుకుంటున్న ప్యాట్ కమ్మిన్స్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియా వన్డే, టీ20 సిరీస్‌కు మిచెల్ మార్ష్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనున్నది. వన్డే జట్టులో ఆస్ట్రేలియా కొన్ని మార్పులు చేసింది. వన్డే స్క్వాడ్ నుంచి లబుషేన్‌ను తప్పించింది. అతని స్థానంలో మాథ్యూ రెన్‌షాను తీసుకున్నది. రెన్‌షా ఇప్పటి వరకు ఆస్ట్రేలియా తరపున 14 టెస్టులు ఆడాడు. అయితే 2022 పాకిస్థాన్ టూరులో అతను వన్డే జట్టులో ఉన్నా.. ఇంకా అరంగేట్రం చేయలేదు. కమ్మిన్స్ లేకపోవడంతో.. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ ప్రధాన బౌలర్ల పాత్రను పోషించనున్నారు. వీరితో పాటు పేస్ బౌలింగ్ బృందంలో గ్జావియర్ బార్ట్‌లెట్, బెన్ డ్వార్షియస్ ఉన్నారు. బ్యాటర్ రెన్‌షా గత సీజన్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున భారీగా పరుగులు సాధించాడు. అతను 50 సగటుతో 350 రన్స్ చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో 80, 106, 62 రన్స్ స్కోర్ చేశాడు. పెర్త్‌లో జరగనున్న ఫస్ట్ వన్డే మ్యాచ్‌కు అలెక్స్ క్యారీ దూరం కానున్నాడు. అక్టోబర్ 15వ తేదీన ఓవల్‌లో జరగనున్న షీఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. మణికట్టుకు సర్జరీ కావడం వల్ల గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను టీ20 సిరీస్‌ను తప్పించారు. తొలి రెండు టీ20 లకు మాత్రమే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఇండియాతో మొత్తం మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. వన్డే జట్టు: మిచెల్ మార్ష్, గ్జావియర్ బార్ట్‌లెట్, అలెక్స్ క్యారీ, కూపర్ కన్నోలీ, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కెమరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్,జోష్ ఇంగ్లిష్, మిచెల్ ఓవన్, మాథ్యూ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

టీ20 జట్టు: మిచెల్ మార్ష్, సీన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహనెమన్, మిచెల్ ఓవన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

## తొలి వరల్డ్ కప్ విజేత.. వెస్టిండీస్ దిగ్గజం కన్నుమూత

మనగళం, వెస్టిండీస్ క్రికెట్‌లో విషాదం నెలకొంది. తొలితరం క్రికెటర్, మొట్టమొదటి ప్రపంచకప్ గెలుపొందిన బెర్నార్డ్ జులియన్ కన్నుమూశాడు. క్లైవ్ లాయిడ్ సారథ్యంలో 1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టులో సభ్యుడైన బెర్నార్డ్ 75 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచాడు. నార్తర్న్ ట్రినిడాడ్‌లో ఆయన మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెటరన్ ప్లేయర్, వరల్డ్ కప్ ఛాంపియన్ అయిన బెర్నాల్డ్ మృతిపట్ల వెస్టిండీస్ క్రికెట్ సంతాపం తెలియజేసింది. ‘బెర్నాల్డ్ మరణం మమ్మల్ని ఎంతో బాధించింది. ఆయన జట్టుకు అందించిన సేవల్ని కొనియాడుతున్నాం. విండీస్ జట్టు మొదటి వరల్డ్ కప్ విజేతగా అవతరించడంలో బెర్నాల్డ్ కృషి ఎంతో ఉంది. ఈ కష్టసమయంలో ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. క్రికెట్ పట్ల ఆయన నిబద్ధత కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు చేకూరాలని ప్రార్ధిస్తున్నాం’ అని విండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో పేర్కొన్నాడు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310